దాటాల్సిన అగడ్తలెన్నో వున్నాయని, కొంచం కొంచంగానైనా
సంకోచాలని వదిలి నేను చెప్పాలనుకుంటున్న సంగతులేవో
చెప్పాలనిపించింది..... నా అంతరాంతరాళంలో జరిగే నిత్య సంఘర్షణల మధ్య,
నా అంతర్లోకాలలో సదా ఒంటరినై సంచరిస్తూ, రాయలేనితనమేదో
నన్ను కమ్ముకున్న వేళ, ఇట్లా రాస్తూ...

విమల

# 4

# సావిత్రి





“అమ్మా! నాన్న ఒకసారి నిన్ను కలుస్తానంటున్నాడు. ఇంటికి రమ్మని చెప్పేదా?” అరుణిమకి ఏమీ సమాధానం చెప్పకుండా, భావరహితంగా ఆమెకేసి చూసింది సావిత్రి.

“చెప్పమ్మా.”

“ఇది నీ ఇల్లు, నీ ఇష్టం.”

“అట్లా అంటావేంటి. ఆయనేం ఇక్కడ ఉండబోవటం లేదు. నీకిష్టం లేదంటే చెప్పు. ఆ సంగతే నాన్నకి చెబుతాను,” అంది అరుణిమ కొంచం నిష్టూరంగా.

అరుణిమకి, కొడుకు క్రాంతికీ వాళ్ల నాన్నని ఇంటికి తీసుకు వచ్చి తమతో పాటు వుంచుకోవాలన్న కోరిక ఉన్న విషయం సావిత్రికి అర్థం కాకపోలేదు. ఆ మనిషి మొఖాన్ని రోజూ చూస్తూ తానుండ గలదా? తను గట్టిగా వద్దంటే వాళ్లేమీ బలవంతం చేయరని తెలు సామెకి. తను కాదు అతను కలవాలని కోరుకుంటున్నాడు. మనసంతా మహాశూన్యంగా అనిపించింది. అయినా, “ఒక్కసారి కలిసేందుకైతే రమ్మను,” నెమ్మదిగా అని మెల్లిగా లేచి తన గదిలోకి వెళ్లింది సావిత్రి.

ఈ సంభాషణ జరిగిన వారంరోజుల తరువాత ఒకరోజు సాయంత్రం సావిత్రి భర్త ప్రకాశరావుని వెంటబెట్టుకుని ఇద్దరు వ్యక్తులు అరుణిమ ఇంటికొచ్చి అతడ్ని దింపి వెళ్లారు.

ఎన్నో ఏళ్లు ఎదురుచూసి, ఇక చూడకూడదని, అతను తన జీవితంలో లేడని నిర్ణయించుకున్నాక, అతను ఇప్పుడొచ్చి తన ముందు కూర్చున్నాడు. ముసలితనం కమ్ముకున్న మొఖంతో, మూడొం తులు నెరిసిపోయి, పల్చబడ్డ తల వెంట్రుకలతో, కొంచం వంగిన నడుముతో, వణుకుతున్న చేతులతో, తెరల తెరల దగ్గులతో, ముక్కు మీదకి జారిన కళ్లద్దాలతో అతనొచ్చాడు. అతను తల వంచుకు కూర్చు న్నాడు. భయమో, సిగ్గో, అవమానమో, మొహమాటమో తెలియదు కానీ, అతను అట్లానే చాలాసేపు కూర్చుండిపోయాడు. ముప్ఫయి

ఏళ్ల క్రితం, వారంరోజుల్లో తిరిగి వస్తానని చెప్పి వెళ్లినవాడు ఇప్పుడిట్లా ముసలి రూపేసుకుని వచ్చి ఆమె ముందు కూర్చున్నాడు.

కాసేపటికి తలెత్తి సావిత్రికేసి చూసి చిన్నగా నవ్వాడు. సావిత్రికి నవ్వు రాలేదు. ఎట్లా వస్తుంది. అతను నవ్వినప్పుడు పళ్లు తెల్లగా తళుక్కున మెరిశాయి. 'కట్టుడు పళ్లనుకుంటాను,' అనుకుంది సావిత్రి.

''అరుణి కాస్సేపయ్యాక వస్తానంది,'' అన్నాడతను సంభాషణ ప్రారంభించే వాడిలా.

ఆమె ఏమీ బదులివ్వలేదు.

సావిత్రికేసి చూస్తూ, ''నువ్వు బాగా లావయ్యావు,'' అని అని మళ్లీ నవ్వాడు. ఈసారి కూడా సావిత్రికి నవ్వు రాలేదు. ఆ తరువాత, ఎలా వున్నావని అతడు ఆమెని కానీ, ఆమె అతడిని కానీ అడగలేదు.

సోఫా పక్కన టీపాయ్ పైనున్న న్యూస్‌పేపర్ తీసి ముక్కు మీదకు జారిన కళ్లద్దాల్లోంచి చూస్తూ చదువుతున్నాడతను. ఈ అలవాటు మాత్రం పోయినట్లు లేదు. చదువుకునేందుకు ఏదన్నా దొరికితే, పక్కన మనుష్యులున్నా అతనికి పట్టేదికాదు. తనపాటికి తాను చదువుకుంటూ వుండేవాడు. అతనికి తెలియని విషయాలంటూ వున్నాయా అనిపించేది సావిత్రికా రోజుల్లో. అట్లా ఎవరి గురించైనా అనుకోవడంకన్నా భ్రమ మరొకటుండదని తరువాత మెల్లిగా అర్థమైందామెకి.

ఈ మనిషిని ప్రేమించి, ఇతని కోసమేనా తను ఇంట్లోంచి పారిపోయి వచ్చింది? తన తల్లిదండ్రులతో, తోబుట్టువులతో తెగదెంపులు చేసుకుంది? ఇతని కోసమేనా చంటిపిల్లల్ని చంకనేసుకుని అజ్ఞాతంగా జీవించింది? ఎప్పుడు ఏం జరుగు తుందోనని నిత్య భయంతో బతికింది. రాత్రి తన పక్కన పడుకుని నిద్రపోయే అతడ్ని ఎవరైనా ఎత్తుకుపోతారేమో, ఏమైనా కీడు తలపెడతారేమోనని పీడకలలు కని, ఉలిక్కిపడి మేల్కొని, అతన్ని మళ్లీ మళ్లీ చూసుకొని, నిశ్చింతగా తల నిమిరి, నుదుటి పై ముద్దు పెట్టుకుని, అతనిపై చేయి వేసుకుని, ఆదమరిచి నిద్రించింది? ఇతడినేనా, సరిగ్గా తిన్నావా లేదా అని పొట్ట నిమిరి, కోప్పడి మరీ తినిపించింది? ఇతడ్ని తలచుకు నేనా ఏళ్ల తరబడి తను దిగులు కళ్ల దుఃఖంతో, ఒంటరితనంతో కుమిలిపోయింది?

ఆ గదిలో సోఫాలు, కాఫీ టేబుల్, పుస్తకాల అలమారా, గోడలకు వేలాడే చిత్రపటాలు, గాలికి ఎగురుతున్న కర్టెన్‌లు, సీలింగ్ నుండి వేలాడుతూ రివ్వున తిరుగు తున్న ఫ్యాను... తను రోజూ చూస్తుండే అలవాటైన ఆ వస్తువుల మధ్య, అసందర్భంగా కొత్తగా వచ్చి చేరిన వస్తువులా కనబడ్డాడతను సావిత్రి కళ్లకి.

అప్పటికి అనేకమార్లు చదివేసిన, కుట్లూడి, పుటలు చినిగిపోయిన పుస్తకం లాంటి జ్ఞాపకాలు. గుర్తుంచుకోదగ్గ అందమైన పంక్తులు కూడా మసిబారిపోయి, అక్షరాలన్నీ చెదిరిపోయి... గాలికి రెపరెపలాడే పుటల్లాంటి ఆలోచనలన్నీ అతని పిలుపుతో ఎగిరిపోయాయి.

"సావిత్రీ..." అంటూ ప్రకాశరావు గొంతు సవరించుకుని ఏదో చెప్పబోయేం తలో దగ్గు ముంచుకొచ్చి, ఖనేళ్, ఖనేళ్‌మని దగ్గుతూ వుంటే, సావిత్రి లోనికెళ్లి మంచి నీళ్ల గ్లాసు పట్టుకొచ్చి అతని చేతికందించింది. తాగి, "థ్యాంక్స్," అన్నాడు. జీరబోయిన అతని గొంతు వికారంగా ధ్వనించింది.

మెడలో పూలదండలతో గోడకి వేలాడుతున్న క్రాంతి పెళ్లిఫొటో చూసి, "వాడినీ, వాడి భార్యని కలిసానీమధ్యే," అన్నాడు ప్రకాశరావు.

ఆ సంగతి అరుణిమ అంటే తెలిసింది. కొడుకు ఆమెతో అంతగా మాట్లాడడు. వాళ్ల నాన్నని పిల్లలిద్దరూ మధ్య, మధ్య రహస్యంగా చాలా ఏళ్లుగా  కలుస్తున్నారని సావిత్రికి తెలుసు. అతనికి ఆరోగ్యం బాగాలేక, ఆసుపత్రికి  వచ్చినప్పుడు పోలీసులకి పట్టుబడ్డాడు. అతను పనిచేస్తున్న పార్టీలో ఏవో అంతర్గత విభేదాలు, చీలికలు వచ్చాయనీ, అతను పార్టీ నుండి బయటకు రావాలని అనుకున్నాడని కూడా చాలాసార్లు గతంలో వార్తలు వచ్చాయి.

ఏడాది తరువాత బెయిలు పైన అతను బయటకు వచ్చాడు. వెళ్లి కలవచ్చు కదా అని తెలిసినవాళ్లు ఒకరిద్దరన్నా, ఆ సమయంలోనూ సావిత్రి అతడ్ని కలిసేందుకు వెళ్లలేదు. తెగి, ఎగిరిపోయిన గాలిపటపు దారం పట్టుకునేందుకు ఇప్పుడు పరుగెత్తడం ఎందుకనుకుందామె.

ప్రకాశరావు సన్నటి, తెల్లటి విక్స్ వేపరబ్ గొట్టం తీసి, ముక్కు దగ్గర పెట్టుకొని గాఢంగా గాలి పీల్చాడు. ఆ తెల్లటి గొట్టం చచ్చిపోయిన వాడి ముక్కురంధ్రాలను మూసి వుంచే తెల్లటి దూది వుండల్లా కనపడ్డాయి సావిత్రికి.

ఇతడు చనిపోతే దేవుడ్ని నమ్మే ఇతడి కొడుకు శ్రార్ధకర్మలు చేస్తాడా! తల వెనుక దీపం పెడతాడా? లేక మొఖం పైన ఎర్రజెండా కప్పుతారా? లేక రెండూ చేస్తారా? సావిత్రికి ఎందుకో వెలపరంగా అనిపించింది. అతడ్ని చూస్తే మరణానికి సన్నద్ధమవుతున్న వృద్ధుడిలా వున్నాడు.

వంటింటిలో కెళ్లి ఓ ప్లేట్‌లో స్వీటు, కారప్పూస పట్టుకొచ్చి అతని ముందు పెట్టింది. దానికేసి చూసి,

"నాకు షుగరు," అన్నాడు.

అతను పాలులేని కాఫీ తాగుతాడని గుర్తుంది సావిత్రికి. చక్కెరేయని బ్లాక్ కాఫీ ఇస్తే, ఆ వేడి కాఫీ జుర్రున తాగాడు. ఈ అలవాటూ మారలేదనుకుందామె.

కొందరి మధ్య సంభాషణలు మంచుగడ్డలా గడ్డకట్టిపోతాయి.

"నువ్వేం మాట్లాడటం లేదు," అన్నాడతను.

"ఏం వుంటుంది? నీతో మాట్లాడేందుకు నాకు?" ఇదీ ఇన్నేళ్ల తరువాత సావిత్రి అతనితో మాట్లాడిన మొదటి మాట.

అలాగే కాస్సేపు మౌనంగా కూర్చుని, కొంచెం కష్టంగా లేచి నిలబడి, దీర్ఘంగా నిట్టూర్చి,

"చనిపోయేలోగా నిన్నొకసారి చూసి, ఒక మాట చెప్పాలనిపించింది," అని వణుకుతున్న రెండు చేతుల్నీ జోడించి,

"సావిత్రీ నన్ను క్షమించు," అన్నాడు ప్రకాశరావు.

ఈ మాట అంటున్నప్పుడు అతని కాంతి లేని కళ్లలో పల్చటి కన్నీటిపొర. బుగ్గలపై జారిన వెచ్చటి కన్నీళ్లు.

ఇప్పుడు సావిత్రికి నవ్వొచ్చింది. కానీ నవ్వలేదు. ఎంత అర్థంలేనిదీ మాట ఇప్పుడు. అతను లేకుండానే గడిచిన ఇన్నాళ్ల ప్రయాణాన్నీ, కలతలనీ, గాయాలనీ, అపనిందల్నీ, నిస్సహాయతల్నీ, లొంగుబాట్లనీ, అవమానాల్నీ ఎన్నిటిని తాను తవ్వు కోవాలి? ఎందుకిదంతా?

తను అతడ్ని క్షమించటమేమిటి? అతడే కాదు, తనూ నిజమని నమ్మిన సత్యాల కోసం దారి వెతుక్కుంటూ జీవితమంతా కొట్లాడిన వాడతను. పోనీ అతనే మన్నా సుఖపడ్డాడా అంటే అదీలేదే. ఇప్పుడిట్లా అనారోగ్యంతో, అలసటతో, ఒంటరిగా తన ముందు నిలబడి తన క్షమని అడుగుతున్నాడు. అన్నేళ్ల క్రితం తాను అతడ్ని అడిగిన ప్రశ్నలకి జవాబులు అతనికి దొరికాయో లేవో తెలీదు నాకు అనుకుందామె అతనికేసి నిర్వికారంగా చూస్తూ.

అతను గడప దాటబోయి తూలి పడబోతే గభాలున అతని భుజం పట్టుకుని గడప దాటించింది సావిత్రి. తడబడే అడుగులతో వెళ్లిపోతున్న అతడ్ని చూస్తే జాలి లాంటి భావన ఏదో కలిగిందామెకి. నిస్సహాయుడైన సాటి మనిషి పట్ల మరో మనిషికి కలిగే భావనలాంటి భావన. ఇంకా నెరవేరని జీవితేచ్ఛని, వదలని కలల్నీ మోసు కుంటూ, తలవంచుకు తడబడుతూ వెళ్లిపోయిన ఆ మనిషి తాలూకు వాసన ఆ గదిలో ఇంకా అట్లానే వుంది.

✤

*శ్రీకాకుళంలోన చిందింది రక్తమ్ము*
*కాల్వలై కలిసింది కొండవాగులలోన*
*బండ లెరుపెక్కినాయీ..*
*పోరాడ కొండలై కదిలినాయీ...*

దేశమంతా నక్సల్‌బరీ వసంతకాలం గర్జిస్తుంటే ఇట్లాంటి పాటలంటే ఎవరి కిష్టముండదు? ప్రకాశరావు విశాఖలో చదువుకుంటున్న కాలం ఎలాంటి కాలం అది? శ్రీకాకుళంలో సాగుతున్న సాయుధ పోరాట వార్తలు, ఆ ఉద్యమంపై అమలవుతున్న తీవ్ర హింసాకాండలతో సమాజం అతలాకుతలం అవుతున్న కాలం అది. కాలేజీ కుర్రాళ్లని ఈ ఉద్యమాలు ఉత్తేజపరిచాయి. ఆ ఉద్యమాలతో సంబంధాలున్న విద్యార్థుల్లో కొందరు ప్రకాశరావుకి స్నేహితులయ్యారు. వాళ్లిచ్చే విప్లవ సాహిత్యాన్ని చాలా ఆసక్తిగా చదివేవాడతను. మొదటినించీ పుస్తకాలు తెగ చదివే అలవాటున్న ప్రకాశరావుకి ఆ సాహిత్యం మరో ప్రపంచానికి దారులు తెరిచినట్లనిపించేది. అతనికి తెలిసిన కొంతమంది మిత్రులు చదువుల్ని అర్ధాంతరంగా ఆపేసి, పోరాటంలోకి వెళ్లిపోయారు.

విజయనగరానికి దగ్గరగానే వున్నా, ఆ ఊరు ఇంకా అప్పటికి పల్లెటూరే. ఆ ఊరికి దగ్గర్లో వున్న ఒక జీడిపిక్కల కంపెనీలో పనిచేసేందుకు తల్లితో పాటు టిఫిన్ డబ్బా పట్టుకు వెళ్లేది సావిత్రి. రెండెకరాల పొలం వున్నప్పటికీ, ఆరేడుగురు కుటుంబ సభ్యులున్న వాళ్లకి ఆ ఆదాయం ఏ మాత్రం సరిపోయేదికాదు. పదోతరగతికే చదువు మానేసినా, రోజూ కంపెనీలో మాడిన జీడిపిక్కల వాసనతో మునిగి తేలుతున్నా, మల్లె పూవులా యవ్వనం కమ్ముకున్న సావిత్రికి అందమైన కలలుండేవి. వంటి నిండా మెరుపులుండేవి. ఏదో తెలియని ఆనందపు కిలకిల నవ్వులుండేవి. అట్లాంటి పది హేడేళ్ల సావిత్రికి, ప్రకాశరావు పరిచయమయ్యాడు. సావిత్రికి వరుసకి బాబాయయ్యే పుల్లయ్య ఇంటికి సమావేశం పెట్టుకునేందుకు వచ్చారు అతనూ, అతని మిత్రులు. వంటలో కాస్త సాయం చేసేందుకు రమ్మంటే వాళ్లింటికి వెళ్లింది. ఎవరికి ఎవరి పట్ల ఎందుకు ఆకర్షణ కలుగుతుందో చెప్పలేనట్లే, సావిత్రికీ, ప్రకాశరావుకీ ఒకరి పట్ల ఒకరికి ఇష్టం కలిగింది. జీవితంలో ఎప్పటికీ పెళ్లి చేసుకోకూడదనీ, ఉద్యమం లోకి వెళ్లిపోవాలని అనుకున్న ప్రకాశరావు ఎంఏ చదువు మధ్యలోనే ఆపేసి, కుటుంబ అవసరాల కోసం టెలిఫోన్ శాఖలో ఉద్యోగంలో చేరాడు. ఏడాదికి పైగా సావిత్రితో సాగుతున్న అతని పరిచయం ప్రేమగా రూపాంతరం చెందింది.

“నన్ను పెళ్లి చేసుకోవడం నీకిష్టమేనా?”

సిగ్గుతో తలవంచుకుని చీరకొంగు ముడివేసి, విప్పుతూ చిరునవ్వు నవ్వుతూ నిలబడ్డ సావిత్రి నోటి నుంచి, "ఇష్టమే," అన్న మాట రావడానికి పదిహేను నిముషాల సమయం పట్టింది. ప్రకాశరావు ఆ మాట కోసం ఓపిగ్గా ఎదురుచూశాడు.

సావిత్రి ఇంట్లోవాళ్లకి ఈ పెళ్లి ఎంతమాత్రం ఇష్టంలేదు. కుర్రవాడు చదువు కున్నవాడే అయినా, బతుకుతాడో, చస్తాడో తెలియని రాజకీయాల్లో వున్నవాడు. వాళ్లు సావిత్రిని కట్టడి చేశారు.

ఓ చీకటి రాత్రి, 'ఊరవతల ఎదురుచూడు మోటర్‌సైకిల్‌పై వచ్చి తీసుకెడ తాను,' అని ప్రకాశరావు అన్నమాట నమ్మి ఆమె కట్టుబట్టలతో ఇంట్లోంచి వచ్చేసింది. అతను రాలేదు. అతని స్నేహితుడు రషీద్ వచ్చాడు. అతనితో కలిసి వెళ్లేందుకు చాలా భయపడింది సావిత్రి. ప్రకాశరావు రానందుకు ఏడ్చేసింది. ఇక వెనక్కి వెళ్లలేదు. తెగించి అతనితోపాటు వెళ్లింది. సీతమ్మధార దగ్గర ఓ డాబా ఇంట్లో ప్రకాశరావు కలిశాడు. వాళ్లిద్దరూ స్నేహితుల సమక్షంలో పూలదండలు మార్చుకొని పెళ్లి చేసు కున్నారు. వాళ్ల సంసారం మొదలైన నాలుగు నెలలకి ప్రకాశరావుని అనుమానం మీద అరెస్టు చేశారు. అతను ఉద్యోగం నుండి సస్పెండ్ అయ్యాడు.

తనకు తెలిసినదానికన్నా అతను మరింత ప్రమాదకరమైన పనుల్లో వున్నాడని సావిత్రికి మెల్లిగా అర్థం కాసాగింది. అతని పార్టీ, అతని పనులు, ఇంటికి వచ్చిపోయే వాళ్లు, వాళ్ల మాటలు, ఈ కొత్త వాతావరణం, అక్కడి స్వేచ్ఛా సావిత్రికి ఎంతో ఆనం దాన్నీ, ధైర్యాన్నీ, నిశ్చింతనీ ఇచ్చేవి. మరీ ముఖ్యంగా ప్రకాశరావు తనతో వుండే పద్ధతి అప్పటివరకూ తాను చూసిన అనేక కుటుంబాలలోని పద్ధతి కన్నా చాలా భిన్నంగా వుండటం ఆమెకి మరింత సంతోషాన్నిచ్చింది. తిట్లు, అవమానాలు, కొట్టడాలు, ఇంట్లోంచి వెళ్లగొడతాని బెదిరించటాలు, చేతికి నయాపైసా ఇవ్వకుండా లొంగ దీయటాలూ లేని భర్త తనకు దొరకటం తన అదృష్టం అనుకునేది సావిత్రి.

ఎప్పుడో మానేసిన చదువు మళ్లీ చదవమని అతడు వత్తిడి చేయటం మాత్రం ఆమెకి అసలు నచ్చేదికాదు. ప్రకాశరావు ఉద్యోగం వదిలేశాడు. అమలాపురంలో వాళ్లమ్మా, తమ్ముడూ ఉండేవాళ్లు. అతనికి తండ్రి లేడు. పెళ్లయిన కొత్తలో ఓసారి ప్రకాశరావుతో పాటూ ఆ ఊరెళ్లిన సావిత్రిని అతని తల్లి సాదరంగా ఆహ్వానించింది. ఐదారు గేదెల్ని, చిన్న కిరాణా దుకాణాన్నీ పెట్టుకొని గుట్టుగా సంసారాన్ని లాక్కొస్తుం దావిడ. ఆమె దగ్గర ఆరునెలల పాటు సావిత్రిని పెట్టి వెళ్లిపోయాడు ప్రకాశరావు. మధ్యలో అతను కబురుచేస్తే కలిసేందుకు రెండుసార్లు వెళ్లి వచ్చింది సావిత్రి. చివరికి ప్రకాశరావు సావిత్రిని తీసుకొని హైదరాబాద్ వచ్చాడు. చిక్కడపల్లి దగ్గర రెండు

గదుల ఇల్లు అద్దెకు తీసుకున్నారు వాళ్లు. ఆ దగ్గరలోనే వున్న ప్రింటింగ్ ప్రెస్‌లో ప్రకాశరావు ఉద్యోగంలో చేరాడు. రషీదు కూడా అక్కడే పనిలో చేరాక సావిత్రికి అర్థమైంది. అక్కడ పార్టీకి అవసరమైన సాహిత్యం ప్రింట్ అవుతుందనీ, వాళ్లిద్దరూ ఆ పనిలోనే ఉన్నారనీ.

"నువ్వు కూడా ఏదైనా పని నేర్చుకో సావిత్రి. ఆర్థికంగా ఎవరిపైనా ఆధారపడకుండా బతకటం ఆడవాళ్లకి చాలా అవసరం," అన్నాడు ప్రకాశరావు. అప్పటికి ఏడో నెల గర్భవతి సావిత్రి. అప్పుడే అత్యవసర పరిస్థితి ప్రకటించారు. వాతావరణం ఏమీ బాగుండలేదు. అరెస్టులు, పోలీసులు పట్టుకుపోయి కాల్చి చంపడాలు జరుగుతున్నాయి.

"నాకు భయంగా వుంది. ఎప్పుడేమవుతుందో," అందోరోజు సావిత్రి.

"ఏమవుతుంది? నన్ను పట్టుకుంటే కాల్చి చంపుతారు," అన్నాడతను చిరునవ్వు నవ్వుతూ.

"మరి నేనేం కావాలి? నా కడుపులో వున్న మన బిడ్డేం కావాలి?"

"అలా అడిగితే నేనేం చెప్పగలను? అందరిలానే మనమూ," అన్నాడతను. ఆ సమాధానం అంత తృప్తిగా అనిపించకపోయినా సావిత్రి మరేమనలేదు.

ప్రింటింగ్ ప్రెస్ దగ్గర మఫ్టీ పోలీసులు తిరుగుతున్న విషయం తెలిసిన వెంటనే, రెండు జతల బట్టలు, అత్యవసర వస్తువుల్నీ పట్టుకుని ప్రకాశరావు, సావిత్రి పాతబస్తీలోని ఒక షల్టర్‌కి వెళ్లారు. అక్కడకి ఆమెని తీసుకొచ్చిన ఓ గంటకి,

" ఇక్కడే ఓ రెండురోజులు వుండు. డెలివరీ అయ్యేవరకూ నిన్ను వుంచేందుకు వేరేచోట ఏర్పాట్లు జరుగుతున్నాయి," అన్నాడు ప్రకాశరావు.

"మరి నువ్వో?"

"నేను వెళ్లిపోవాలి. పరిస్థితులేం బాలేవు." సావిత్రికీ తెలుసా సంగతి.

ఆ రాత్రి అతని పక్కన పడుకున్నప్పుడు ఏం అనాలో, ఏం చేయాలో అర్థంకాని నిస్సహాయతతో, దిగులుతో ఆమె ఏడ్చింది.

ఆమెని పొదివి పట్టుకుని, "ఏడవకు, నేను తప్పకుండా వస్తాను కదా!" అన్నాడు ప్రకాశరావు. అతని గొంతులో ధ్వనించిన అపనమ్మకం ఆమెని తాకింది. చీరకొంగుతో కళ్లు తుడుచుకుని అతనికేసి దీర్ఘంగా చూసింది సావిత్రి. ఆ రాత్రి ఆమె నిద్రపోలేదు.

ప్రకాశరావు వెళ్లిపోయాడు. సావిత్రిని నల్గొండలోని మిరియాలగూడాలో, ఒకరి ఇంట్లో వుంచారు. అక్కడే సావిత్రికి అరుణిమ పుట్టింది. ఆ ఇంటివాళ్ల ప్రేమ చూసి,

తన కన్నవారు కూడా అంత బాగా చూసుకునేవారు కాదేమో అనుకునేదామె. ఎమర్జెన్సీ ఎత్తేసి, జనతా ప్రభుత్వం అధికారంలోకి వచ్చేదాకా అక్కడే వుంది సావిత్రి. అప్పు డప్పుడు కలిసేందుకు వచ్చేవాడు ప్రకాశరావు. ఆ నిర్బంధ కాలం అంతా అతను బయటి రాష్ట్రాల్లో కాలం గడిపాడు. ఇక తామిద్దరం కలిసే వుంటామనుకుంది సావిత్రి.

ఈసారి వాళ్ల మకాం హైదరాబాదు నగరం నుండి మారింది. నడివయసు దాటిన ఇద్దరు భార్యాభర్తలు, ఓ పద్దెనిమిదేళ్ల కుర్రవాడు రవి వాళ్లతోపాటు వుండే వాళ్లు. పెద్దవాళ్లిద్దరూ సావిత్రి తల్లిదండ్రులుగా, ఆ కుర్రవాడు ఆమెకి తమ్ముడుగా, వ్యవహరించేవాళ్లు. ప్రకాశరావు వ్యాపారస్తుడనీ, పనిమీద ఎక్కువగా ఊర్లు తిరుగు తుంటాడనీ చెప్పుకునేవాళ్లు వాళ్లంతా. అక్కడున్నప్పుడే సావిత్రికి క్రాంతి పుట్టాడు.

గతం నుండీ సాగుతున్న వరంగల్, గోదావరీలోయ పోరాటాలే కాదు, కొత్తగా ఉత్తర తెలంగాణాలో రాజుకున్న పోరాటాలు రాష్ట్రం అంతటా దావానంలా వ్యాపిం చాయి. ప్రకాశరావుతో సహా ఎవరికీ క్షణం తీరికలేదు. అందరి మనసుల్లోనూ కొత్త ఆశలు చిగురించాయి. ఇలాంటి పరిస్థితుల్లోనే వారంరోజుల్లో మళ్లీ వచ్చి కలుస్తాన్న ప్రకాశరావు కనపడకుండానే వెళ్లిపోయాడు. ఇద్దరు పిల్లల్ని చేతబట్టుకుని, సావిత్రి హైదరాబాదు చేరుకుంది. మరికొంత కాలానికి, రహస్య జీవితంలో తమతోపాటు వున్న రవి మణుగూరు అడవుల దగ్గర జరిగిన ఎదురుకాల్పుల్లో చనిపోయాడన్న వార్త విని సావిత్రి చాలా బాధపడింది.

తను ఉద్యమం నిర్మించేందుకు అడవిలోకి వెళ్లిపోయానని, ధైర్యంగా జీవిం చేందుకు ప్రయత్నించమనీ, ఆరునెలల తరువాత చిన్న చిట్టీ పంపాడు ప్రకాశరావు. అతనికేం అవుతుందన్న దిగులుకన్నా, ఈ ఇద్దరు పిల్లల్ని ఎలా పెంచాలి? ఇంతటి భారాన్ని తాను ఒక్కతే మోయటం ఎలా అన్న భయం ఆమెని వణికించింది.

పార్టీవాళ్లు ఆర్థికంగా కొంత సహాయపడినా, తన జీవికను తాను వెతుక్కో వల్సిన పరిస్థితి సావిత్రిది. ఇలాంటి స్థితిలోనే రషీద్ సావిత్రి జీవితంలోకి వచ్చాడు. ఎమర్జెన్సీ కాలంలో అరెస్టయి, చిత్రహింసల పాలై మూడేళ్లపాటు జైల్లో వున్నాడు. ఆరోగ్యం బాగా దెబ్బతిని, పూర్తికాలం ఉద్యమంలో పనిచేయలేననుకుని, చిన్న ప్రింటింగ్ ప్రెస్ పెట్టుకుని బతుకుతున్నాడు. అతనే ఆమెకి సనత్‌నగర్ దగ్గరి ఓ ఫ్యాక్టరీలో చిన్న ఉద్యోగం ఇప్పించాడు. కూతుర్ని, కొడుకునూ బడిలో వేసింది. రమ్మని పిలవగానే ఊరి నుంచి ప్రకాశరావు తల్లి వచ్చింది. సావిత్రికి కొంచెం నిశ్చింత దొరికింది. ప్రకాశరావు నుండి అడపాదడపా ఉత్తరాలు వచ్చేవి. కానీ అతను ఆమెని

కలవలేదు. కష్టం సుఖం చెప్పుకునేందుకు, ఏదైనా సహాయం కావల్సి వచ్చినప్పుడు ఆమె రషీద్‌నే అడిగేది. ప్రకాశరావు తల్లి చనిపోయాక సావిత్రి ఇంటికి రషీద్ రాకపోకలు ఎక్కువయ్యాయి. పిల్లలిద్దరికీ రషీద్ దగ్గర చనువెక్కువ. వాళ్లతన్ని చిన్నాన్న అని పిలిచేవారు.

"రషీద్ ఎవరైనా మంచి పిల్లని చూసుకొని నువ్వు పెళ్లిచేసుకో," అంది సావిత్రి.

"నాకెక్కడ దొరుకుతుంది పిల్ల," అని నవ్వాడు రషీద్.

"నేను చూసేదా?"

"నువ్వు చూసే పిల్ల నీలాగెట్లా వుంటుంది."

"అంటే?"

"ఏం లేదు. ఎందుకులే!"

అతని మాటలు కొంచం అర్థమై, అర్థం కానట్లనిపించి అతనికేసి నిదానించి చూసింది. ఉన్న వయసుకన్నా చిన్నగా కనిపించే బక్క పలచని, కలలు కనే కళ్లున్న వాడు రషీద్. కవిత్వం రాసేవాడు. బొమ్మలు గీసేవాడు. ఎన్నో ఏళ్లుగా తనకు తెలిసిన రషీద్ ఆ వేళ కొత్తగా కనిపించాడు సావిత్రి కళ్లకి. పరిచయమైన మొదటిరోజుల్లోనే అతను తాను రాసిన కవిత్వం సావిత్రికి వినిపించేవాడు. సావిత్రి పట్ల కన్సర్న్‌తో వుండేవాడు. అతను చొరవగా వుండడనీ, ఊగిసలాడతాడనీ, 'మీ కవులు, కళాకారులంత మానసిక దుర్బలురు మరొకరుండరు రషీద్,' అంటూ ప్రకాశరావు అతన్ని విసుక్కునేవాడు. అట్లాంటి రషీద్ సావిత్రికి అండగా నిలబడ్డాడిప్పుడు.

నాలుగేళ్ల తరువాత, ప్రకాశరావు పిలుపుమేరకి పిల్లల్ని తీసుకుని అతను రమ్మన్న చోటుకు వెళ్లింది సావిత్రి. తండ్రి పిలవగానే అరుణిమ దగ్గరికెళ్లిందిగానీ, క్రాంతి వెళ్లలేదు. అందరూ భోజనాలు చేశాక, అతను సావిత్రితో విడిగా కాస్సేపు మాట్లాడాడు.

"నీ బాధ్యతగానీ, పిల్లల బాధ్యతగానీ తీసుకోలేకపోయినందుకు నీకు నామీద చాలా కోపంగా వుండవచ్చు. కానీ తప్పదు సావిత్రీ, ఇట్లా తప్పదు," అన్నాడు ప్రకాశరావు.

"నువ్వు చేసే త్యాగాల్లో, నేనూ, నీ పిల్లలూ ఓ భాగం కాబోలు," అంది సావిత్రి కొంచం నిష్టూరంగా.

"నేను అలసిపోయాను. ఇట్లా నిత్యం ఏదో ఒక భయంతో బతకటం నా వల్ల కావటంలేదు," అంది ఆమే మళ్లీ.

"నేనిప్పుడున్నాను. రేపు చనిపోవచ్చు. అప్పుడేమిటీ," అన్నాడు ప్రకాశరావు ఆమె మాటలకి అదే సమాధానమన్నట్లు.

"నువ్వు ఉండటానికీ, చనిపోవడానికీ మధ్య తేడా కనపడం లేదయ్యా నాకు," అంది సావిత్రి కోపంగా.

"అయితే లేననే అనుకో," అంటూ నవ్వాడు ప్రకాశరావు.

కాస్సేపటి మౌనం తరువాత, "అయినా రషీద్ నీకు సాయపడుతున్నాడు కదా," అన్నాడు ప్రకాశరావు. అతని గొంతులో కొంచెం వ్యంగ్యం ధ్వనించి సావిత్రికి మరింత కోపం వచ్చింది.

"అవును, అయితే?" అతనామెకిప్పుడు పూర్తిగా పరాయివాడుగా అగపడ్డాడు.

"నిన్నూ, నీ పోరాటాల్నీ తప్పని నేనన్ను, విప్లవం ఎట్లా తేవాలో మీకు వ్యూహాలు, ఎత్తుగడలూ అంటూ ఏవో వుంటాయి కదా! అందులో నాలాంటివాళ్లూ, మన పిల్లల్లాంటివాళ్లూ భాగం కాదా? అనుకొనో, అనుకోకుండానో నీలాంటివాళ్ల చుట్టూ అల్లుకున్న మా జీవితాలు ఏం కావాలి? ఏం ఆలోచిస్తున్నారు మీరు? నీలాగా అన్నీ తెంచేసుకుని వెళ్లలేకే, మనమిద్దరం కలిసి కన్న పిల్లలకోసం నేనిట్లా ఆగి పోయాను కదా? బతికేందుకు తన్నుకలాడతా వున్నా కదా? మరి నన్నెవరి సాయం తీసుకోమంటావో చెప్పి పో," అంది సావిత్రి దు:ఖంతో పూడుకుపోయిన గొంతుతో.

"మన ప్రశ్నలన్నిటికీ జవాబులు రెడీగా వుండవు సావిత్రీ. నీకు ఏం జవాబి వ్వాలో నాక్కూడా తెలీదు. నేనెవరిని నీలా అడగను చెప్పు? మన జవాబుల వెతుకు లాటే కదా ఈ పోరాటం. ఏమో! ఇవ్వాళ్ల కాకపోయినా, రేపటికి దారేదైనా దొరకచ్చేమో? మరి," అంటూ అతనేదో అన్నాడు. అతడేమన్నాడో సావిత్రికి అర్థంకాలేదు.

చీకటి త్వరగా కమ్ముకున్న ఆ అమావాస్య రాత్రి తెరచిన వాకిలి దాటి అట్లా చీకటిలోకి వెలుతురు వెతుక్కుంటూ వెళ్లిపోతున్న అతనికేసి ఆమె చూస్తూ నిలబడి పోయింది. ఆమెని చుట్టుకున్న పిల్లలిద్దరి తలలపైనా ఆమె చేతులు నెమ్మదిగా వాలాయి. అదే ఆఖరిసారి ఆమె ప్రకాశరావును చూడటం.

✤

ఇది జరిగిన మరికొన్నాళ్లకి ప్రకాశరావు దగ్గరి నుండి ఒక ఉత్తరం వచ్చింది సావిత్రికి. తను ఉద్యమం నుండి బయటకు రాలేనని, నీ జీవితంపైనా, నీ స్వేచ్ఛపైనా నాతో వున్న సంబంధం సంకెలవలే వేలాడటం సరైంది కాదనీ, మనం స్వచ్ఛందంగా విడిపోయి, ఎవరి జీవితాలు వారు జీవిద్దామనీ రాశాడతను. రషీద్‌కా ఉత్తరం చూపిం

చింది సావిత్రి. అతను పార్టీవాళ్లతో మాట్లాడదాం అన్నాడు. సావిత్రి అవసరం లేదని సమాధానమిచ్చింది. ఆమె అతనికి జవాబేమీ రాయలేదు. కానీ అతనితో తన బంధం ఇక ముగిసినట్లే అని ఆమెకి అర్థమైంది.

రషీద్‌ని తమతోపాటు వచ్చి వుండమని సావిత్రి అడిగితే అతను సంకోచించాడు. సావిత్రి వత్తిడి చేయలేదు. ఎప్పుడన్నా ఉండాలనుకుంటే ఒకటి రెండు రోజులు వుండిపోయేవాడు. అరుణిమ తండ్రి రాజకీయాల పట్ల ఆసక్తి చూపటమే కాదు, విద్యార్థి సంఘాల్లో చురుగ్గా పాల్గొనేది. తల్లి పట్ల, రషీద్ పట్లా ప్రేమగా వుండేది. క్రాంతి కూడా అక్కతో పాటు మీటింగులకి వెడుతుండేవాడు. పిల్లలని వద్దని ఆమె ఎన్నడూ అనేదికాదు. ఎదుగుతున్న క్రాంతిలో మార్పు నెమ్మదిగా వచ్చింది. వాడి డస్క్‌లో దేవుళ్ల బొమ్మలు చూసి సావిత్రి ఆశ్చర్యపోయింది. దేవుడికి దండం పెట్టుకోవడం, గుళ్లకెళ్లటం, పండగలు చేయటం ఏనాడో మానేసింది సావిత్రి. పిల్లలకీ అదే అలవాటు. అట్లాంటిది వాడి దగ్గర దేవుడి బొమ్మ. వాడు ఎవరితోనూ కలవకుండా ఒంటరిగా వుండేందుకు ఇష్టపడటం మొదలెట్టాడు. వాడి లోలోపల ఏం జరుగుతుందో సావిత్రికి అంతుపట్టలేదు. వాడిలో పెరుగుతున్న అశాంతి, కోపం దాచుకోడం చాతకానితనంతో, అక్కతో, అమ్మతో అప్పుడప్పుడూ తగాదా పడేవాడు. చివరికి రషీద్ పైకి వాడి కోపం మళ్లింది. ఈ పరిణామాల పట్ల సావిత్రికి చాలా ఆందోళనగా వుండేది.

"వాడు ఎదుగుతున్నాడు. ఈ వయసులో పిల్లల్లో ఇలాంటి తిరుగుబాటే వుంటుంది. అదే సర్దుకుంటుంది. నువ్వేం కంగారుపడకు," అన్నాడు రషీద్.

ఒకసారి సావిత్రితో వాదిస్తూ, "నీ గురించి బయట అందరూ ఏమనుకుంటున్నారో తెలుసా నీకు," అంటూ క్రాంతి ఒక మాటన్నాడు. వాడలాంటి మాట ఎలాంటి సంకోచం లేకుండా అనగలిగినందుకు సావిత్రి మనసుకి చాలా కష్టమనిపించింది.

"నువ్వు కదా రషీద్, అవాళ నాకు అండగా నిలబడింది. నీకంటూ ఒక స్వంత జీవితం లేకుండా, నాకోసం, నా పిల్లల కోసం ఇట్లా మిగిలిపోయింది," అంటూ రషీద్ దగ్గర చెప్పుకుని బాధపడింది.

క్రాంతి ఇప్పుడు తన గదిలో దేవుడి బొమ్మలు పెట్టుకుని బాహాటంగానే పూజ చేయడం మొదలెట్టాడు. ఖరగ్‌పూర్ ఐఐటీలో సీటు వచ్చి వెళ్లిపోయేప్పుడు హెచ్చరికలాగే వాడు రషీద్ ముందే,

"అతను కావాలో, నేను కావాలో తేల్చుకో అమ్మా. అతనొస్తే నేనీ ఇంటికి మళ్లీ రాను," అన్నాడు.

"అమ్మ జీవితం మీద నీ పెత్తనం ఏమిటిరా? అసలు నువ్వెడివి ఇలా మాట్లాడటానికి? నీకు సంబంధంలేని విషయాల్లో తలదూర్చకు," అంటూ అరుణిమ అంతెత్తున క్రాంతి మీద ఎగిరిపడింది.

వాడి మాటలకి సావిత్రి నిర్ఘాంతపడి, ఏం అనాలో తోచక అలా నిలబడిపోయింది. క్రాంతి వెళ్లిపోయిన చాలాసేపటి వరకూ రషీద్ కూర్చున్నచోటి నుండి లేవలేదు. తప్పిపోయిన లేగదూడ కోసం బెదురు కళ్లతో వెతుక్కుంటున్న గంగిగోవులా ఆతని చూపులు తారట్లాడాయి. అతని చేతుల మీద పెరిగిన పిల్లవాడు క్రాంతి.

కోడిపిల్లలని పట్టుకునేందుకు వంగి చేతులు చాచి పరుగెడుతున్న వాడి బొమ్మ రషీద్ గీశాడు. గోడకు వేలాడుతున్న ఆ చిత్రంకేసి చూసింది సావిత్రి. తన పాలు తాగిన పిల్లవాడు. తను జోలపాడితే నిద్దరోయిన వాడు. చంకనెక్కి దిగనని మారాం చేసినవాడు. తను కథలు చెప్పి గోరుముద్దలు తినిపించిన వాడు. రాత్రుళ్లు ఒంటరిగా వొంటేలు పోసుకునేందుకు భయపడిన వాడు. మూతి మీద మీసాలు మొలవటం మొదలయ్యాక అమ్మ పైన తన పెత్తనాన్ని స్థిరపరిచిన వాడు. వాడు తన కొడుకేనా? వాడి తండ్రి కూడా అనేందుకు సిద్ధపడని మాటల్ని జంకూ గొంకూ లేకుండా అనగలుతున్న వాడు...

రషీద్ ఎప్పుడెళ్లిపోయాడో కూడా సావిత్రికి తెలీలేదు. అతను నెలరోజుల పాటు సావిత్రి ఇంటికి రాలేదు. ఎలాంటి కబురూ లేదు. చివరికి సావిత్రే అతని దగ్గరికి వెళ్లింది. అతను తన సామాన్లు సర్దుకుంటున్నాడు.

"నువ్వు కూడా నాకు చెప్పకుండానే వెళ్లిపోదామనుకున్నావా రషీద్," అంది సావిత్రి చెంపల మీద కారుతున్న కన్నీళ్లని తుడుచుకుంటూ. అతడామెని గుండెలకు హద్దుకుని తడి కళ్లపై ముద్దు పెట్టుకున్నాడు.

"మన జీవితం మన చేతుల్లోనే వుందనుకుంటాం కానీ, చాలాసార్లు అట్లా వుండదు. చాలామంది వ్యక్తులు, పరిస్థితులు మనల్ని ప్రభావితం చేస్తాయి. ఎదిరించగలిగిన సంసిద్ధత మనకే వుండదు. చాలాసార్లు," అన్నాడు రషీద్.

"నువ్వు నా దగ్గరుంటే నాకు చాలా నిశ్చింతగా, శాంతంగా వుంటుంది రషీద్," అంది సావిత్రి.

అతనామె తల నిమిరాడు.

"నేను కొంతకాలం ఎటైనా వెడతాను సావిత్రి. నువ్వు నాతో రాగలవా?"

అతని కేసి తలెత్తి, తల అడ్డంగా ఊపి ఆమె నవ్వింది. అతనూ నవ్వి,

"నాకు తెలుసు," అన్నాడు ఆమె నుదిటిమీద ముద్దు పెట్టుకుని. అదే వాళ్లిద్దరి ఆఖరి కలయిక.

వంటరితనపు కరకుదారుల్లో జీవితం నడిచి, నడచి కడకు పిల్లలిద్దరూ వాళ్ల బతుకు వాళ్లు బతకగలిగిన ప్రయోజకులయ్యాక కూడా అరవయి మూడేళ్ల సావిత్రి ఇంకా ఒంటరిదే.

"అమ్మా చీకట్లో కూర్చున్నావేంటి?" అంటూ అరుణిమ వచ్చి లైటేసే వరకూ అలానే కూర్చుంది సావిత్రి.

అరుణిమని చూడగానే సావిత్రి వేసిన మొదటి ప్రశ్న, "అరుణీ, రషీద్ ఎక్కడున్నాడో తెలుసా? నాకోసారి చూడాలని వుంది," అని.

*చినుకు మాసపత్రిక*
*ఏప్రిల్ 2015*

*



1 మే 1960న పుట్టిన విమల కవిగా ప్రసిద్ధురాలు. 15వ ఏటనే కథలు రాయటం ప్రారంభించినా, తొలికథ 1978లో నూతన మాసపత్రికలో అచ్చయింది. సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ కథలు రాస్తున్నారు. రెండు కవితా సంపుటాలు, ఒక కథాసంపుటం కొన్ని నక్షత్రాలు కాసిన్ని కన్నీళ్లూ... ప్రచురించారు. గతంలో విప్లవ రచయితల సంఘం, ప్రగతిశీల మహిళాసమాఖ్య (పిఓడబ్ల్యు)ల్లో చురుగ్గా పాల్గొన్నారు. ప్రస్తుతం సామాజిక కార్యకర్త.

*చిరునామా: 6-3-628/5, జి-4, బాసర్ అపార్ట్‌మెంట్స్, రవీంద్రనగర్, ఖైరతాబాద్, హైదరాబాద్-500 004 ఫోన్: 9885201686*
**vimalamorthala@gmail.com**